www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 10 ఫిబ్రవరి 2025

5

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ

నాగులచెరువుకు బస్సు సౌకర్యం కల్పించాలి

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

మండలంలోని నాగుల చెరువు గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని ఎంపిటిసి సభ్యుడు కుంచె ప్రసన్నకుమార్ అధికారులను కోరారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నాగుల చెరువు గ్రామానికి రహదారి సౌకర్యం ఉన్నప్పటికీ శివారు ప్రాంతం కావడంతో ఆర్‌టిసి అధికారులు ఇప్పటి వరకు బస్సు సౌకర్యం కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నాగుల చెరువు గ్రామం నుండి ఇతర ప్రాంతాలకు చదువుల నిమిత్తం వెళ్లే విద్యార్థులు, ప్రయాణికులకు బస్సు సౌకర్యం లేక పలు అవస్థలు పడుతున్నారన్నారు. గతంలో ఇదే సమస్యను అనేకసార్లు అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లినప్పటికీ ఫలితం లేకపోయిందన్నారు. సంబంధిత అధికారులు స్పందించి నాగుల చెరువు గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని ప్రసన్నకుమార్ తో పాటు గ్రామస్తులు కోరారు.

నింగినంటుతున్న పసిడి ధర

- 10 గ్రాములు రూ.87 వేలు దాటిన వైనం
- జిల్లాలో తగ్గిన అమ్మకాలు
- రూ.లక్షకు చేరువలో వెండి ధర
- పాత బంగారం మార్పిడికే మొగ్గు

ప్రజాశక్తి - రాజోలు

పసిడి ధరలు మిడిసిపడుతున్నాయి. బంగారం ధర ఆల్‌టైమ్ హై నమోదు చేసుకుంది. 24 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.86,670కు చేరింది. చైనా భారీగా బంగారం కొనుగోలు చేయడం, అమెరికాలో ప్రభుత్వ మార్పు, డాలర్‌తో రూపాయి మారకం విలువ పడిపోవడం ధరల పెరుగుదలకు కారణంగా చెబుతున్నారు. అలాగే కొన్నిరోజులుగా స్టాక్ మార్కెట్‌లో ఒడిదుడుకులతో మదుపరులు సురక్షితమైన పెట్టుబడిగా బంగారం వైపు చూస్తున్నారు. మరో వైపు వెండి ధర కూడా పెరుగుతోంది. ప్రస్తుతం వెండి కిలో రూ.1,07,000 చేరింది. ముంబై మార్కెట్ ధరలను పోలి జిల్లాలో వ్యాపారం జరుగుతుంది. కోనసీమ జిల్లాలోని మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.86,670, 22 క్యారెట్ల ఆభరణాల బంగారం ధర 10 గ్రాములు రూ.79,450గా ఉంది. 916 కెడిఎం ఆభరణాల బంగారం కాసు ధర రూ.69,336 కు పలికింది.

పెళ్లిళ్ల సీజన్.. కనిపించని ప్రభావం

ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలో పండుగల సీజన్‌లో బంగారం వ్యాపారం సాధారణ స్థాయిలోనే జరిగింది. మరోవైపు పెళ్లిళ్ల సీజన్ మొదలయ్యింది. పసిడి ధరల పెరుగుదల అమ్మకాలపై ప్రభావం చూపింది. పెళ్లిళ్ల సీజన్‌లోనూ జ్యూయలరీ దుకాణాలు వెలవెల బోతున్నాయి. ఒక్క అమలాపురం మార్కెట్‌లోనే హోల్‌సేల్, రిటైల్ కలిపి రోజుకు రూ.2 కోట్ల వరకూ బంగారం అమ్మకాలు జరుగుతాయి. ఉమ్మడి జిల్లాలోని కాకినాడ, రాజమండ్రి, అమలాపురం పట్టణాల్లో పెద్దెత్తున బంగారం అమ్మకాలు జరుగుతాయి. ప్రస్తుతం జిల్లాలో రోజుకు రూ.1.50కోట్ల వరకు అమ్మకాలు తగ్గినట్లుగా అంచనా. దాదాపు 30 శాతం అమ్మకాలు పడిపోయాయి.

రికార్డు స్థాయిలో పాత బంగారం మార్పిడి

ధరల పెరుగుదలతో ఆభరణాల అమ్మకాలు బాగా తగ్గాయి. పెట్టుబడిగా బిస్కెట్ బంగారం అమ్మకాలు ఓ మాదిరిగా సాగుతున్నాయి. ఇక పాత బంగారం మార్పిడి జోష్ అన్ని పట్టణాల్లో రికార్డు స్థాయిలో కనిపిస్తోంది. ధర ఆల్‌టైమ్ హైకు చేరడంతో పాత బంగారం మార్పిడికి ఇదే సమయంగా కొనుగోలుదారులు భావిస్తున్నారు. ప్రస్తుతం అమ్మకాల్లో 50 శాతం పాత బంగారం మార్పిడితోనే జరుగుతుంది.

మరింత పెరిగే అవకాశం

బంగారం ధరలు పెరిగే అవకాశం ఉంది. తగ్గే దారి కనిపించడం లేదు. ధరలను అంచనా వే యలేకపోతున్నాం. ప్రస్తుతం 30 శాతం మేర అమ్మకాలు తగ్గాయి. నగదుతో ఎవరూ బంగారం కొనుగోలు చేయడం లేదు. పాత బంగారం మార్చుకుని కొత్త వస్తువులకు ఆర్డర్లు ఇస్తున్నారు.

- లక్ష్మిశెట్టి రత్నబాబు, వ్యాపారి, తాటిపాక

సర్వ శిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - అమలాపురం

సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్‌సి ఐవి

సర్వ శిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు (ఐవి) అన్నారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా సమగ్ర శిక్ష జెఎసి జిల్లా సమావేశం ఆదివారం స్థానిక అశోక్ నగర్ ప్రెస్ క్లబ్ నందు నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా జెఎసి అధ్యక్షులు సిహెచ్.వెంకన్నబాబు అధ్యక్షత వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర జెఎసి అధ్యక్షులు ఎ.కాంతారావు, రాష్ట్ర సిఐటియు అధ్యక్షులు ఎవి.నాగేశ్వరరావు, పిడిఎఫ్ ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు, సిఐటియు నాయకులు దుర్గాప్రసాద్, బలరాం, ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు దొరబాబు, యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు పెంకే వెంకటేశ్వరరావు తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సమావేశంలోని వారు మాట్లాడుతూ జిఒ నెంబరు.20 రద్దు చేయాలని, ఎస్‌ఎస్‌ఎ ఉద్యోగులకు ఎంటిఎస్ సౌకర్యం కల్పించాలని హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెఎసి జిల్లా కార్యదర్శి బత్తుల శ్రీనివాస్, గంగాధర్, రమాదేవి, గౌతమ్ ప్రసాద్, అయితాబత్తుల శ్రీనివాసు, రాజేంద్రప్రసాద్, సుబ్రమణ్యం మిగిలిన విభాగాల సభ్యులు పాల్గొన్నారు.

104 ఉద్యోగుల డిమాండ్లు నెరవేర్చాలి

సిఐటియు రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరరావు

మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి.నాగేశ్వరరావు

ప్రజాశక్తి - అమలాపురం

104 ఉద్యోగుల డిమాండ్లు నెరవేర్చాలని సిఐటియు రాష్ట్ర అధ్యక్షుడు ఎవి.నాగేశ్వరరావు అన్నారు. 104 రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం యుటిఎఫ్ భవనంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సిఐటియు అధ్యక్షులు ఎవి.నాగేశ్వరావు, అంబేద్కర్ కోనసీమ జిల్లా సిఐటియు ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ నూకల బలరాం, 104 రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.రాంబాబు, అంబేద్కర్ కోనసీమ జిల్లా 104 ఉద్యోగ సంఘం అధ్యక్షులు చంద్రశేఖర్, 104 ఉద్యోగులు సంఘం ప్రధాన కార్యదర్శి త్రిమూర్తులు, 104 ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఓం ప్రకాష్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాసరావు సంఘ ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 104 ఉద్యోగులు డిఇఒగా, డ్రైవర్‌గా పనిచేస్తూ ప్రజలకు సేవ చేస్తూ ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా ఉంటూ కూటమి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకొస్తున్నారన్నారు. అయితే వీరికి కనీస వేతనాలు అమలు చేయకపోవడం అన్యాయమని అన్నారు. కొత్తగా తయారు చేసిన ఆర్‌ఎఫ్‌పిలో డిఇఒలకు జీతభత్యాలు విషయంలో ఎటువంటి మార్పు జరగలేదన్నారు. అదేవిధంగా శ్లాబ్ విషయంలో స్పష్టత లేదన్నారు. పిఎఫ్, ఇఎస్‌ఐ విషయంలో స్పష్టత లేదన్నారు. ప్రభుత్వం చొరవ తీసుకుని ఉద్యోగులకు న్యాయం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో 104 ఉద్యోగుల సంఘ నాయకులు ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

104 ఉద్యోగుల ప్రధాన డిమాండ్లు

1) 104 పని చేస్తున్న డిఇఒ, డ్రైవర్‌లు అందరికీ శ్లాబ్ అమలు చేయాలి. శ్లాబ్ ఆటోమేటిక్ అప్డేషన్ అమలయ్యే విధంగా ఆర్ ఎఫ్ పి నందు పొందుపరచాలి. 2) 104 లో సిటిసి విధానాన్ని రద్దుచేసి ఇపిఎఫ్ యాజమాన్యం వాటా యాజమాన్యం చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలి. 3) ఇఎస్ ఐ అనేది ఆర్ ఎఫ్ పి లో పొందుపరచాలి. 4)104ఉద్యోగులు అందరికీ వెయిటేజ్ మార్కులు ఇవ్వాలి. ప్రభుత్వ నియామకాల్లో ప్రాధాన్యత కలిపించాలి. 5) 104 లో పనిచేస్తున్న ఉద్యోగులకు గతంలో మాదిరిగా ఫుడ్ అలవెన్స్ ఇవ్వాలి.

వెల్ఫేర్ బోర్డును యథావిధిగా కొనసాగించాలి

ప్రజాశక్తి - కాట్రేనికోన

కూటమి ప్రభుత్వం భవనిర్మాణ కార్మికులు వెల్ఫేర్ బోర్డు యథావిధిగా కొనసాగించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.దుర్గా ప్రసాద్ అన్నారు. కార్మికులకు రావాల్సిన క్లైములు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. సూర్య పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం ఆదివారం కందికుప్ప గ్రామంలో నిర్వహించారు. సమావేశానికి సిఐటియు జిల్లా అధ్యక్షులు జి దురా ప్రసాద్ ప్రతినిధిగా హాజరై మాట్లాడారు. గత ప్రభుత్వం హయాంలో లో భవనిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డు ను నిలిపివేశారని ఆనాటి నుండి నేటి వరకు అనేక పోరాటాలు చేసినప్పటికీ వెల్ఫేర్ బోర్డు కొనసాగించడం లేదని మండిపడ్డారు. వెల్ఫేర్ బోర్డు వల్ల ఉపయోగకరంగా ఉండేదని అన్నారు. టిడిపి ప్రతిపక్షంగా ఉన్నప్పుడు మేము అధికారంలోకి వస్తే భవనిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డు యథా విధిగా కొనసాగిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 8 నెలలు కావస్తున్న భవణ నిర్మాణ కార్మికుల కోసం మాట్లాడక పోవడం బాధాకరం అన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రూ.కోటి వెల్ఫేర్ బోర్డు కీ నిధులు ఇస్తానని వెల్ఫేర్ బోర్డు యధావిధిగా కొనసాగించేటట్టు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినప్పటికీ ఆచరణలో చూపలేదని విమర్శించారు. కార్మికులు శ్రమ ద్వారా వచ్చిన నిధులను కార్మికులకే ఖర్చు చేయకుండా వెల్పర్ బోర్డు నిలుపుదల చేయడం రాజ్యాంగ విరుద్ధమని అన్నారు కార్యక్రమంలో భవనిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు విప్పర్తి మోహన్ రావు, శ్రీ సూర్య పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు రేవు వెంకటరమణ, ఉపాధ్యక్షులు జగడం చినబాబు,చిన్నారావు, అయితా బత్తుల త్రిమూర్తులు, బొంతు రాంబాబు, రమేష్, పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న సిఐటియు జిల్లా అధ్యక్షులు దుర్గాప్రసాద్

సమావేశం లో మాట్లాడుతున్న విక్టరీ వెంకటరెడ్డి

కాటన్ కళాపరిషత్ సిల్వర్ జూబ్లీకి సన్నాహాలు

ప్రజాశక్తి - రావులపాలెం

కాటన్ కళాపరిషత్ సిఆర్‌సి ఆధ్వర్యంలో ఉగాది పండగను పురస్కరించుకుని సిల్వర్ జూబ్లీ మార్చి 30, 31, ఏప్రిల్ 1 తేదీల్లో రాష్ట్రస్థాయి ఆహ్వాన నాటిక పోటీలు నిర్వహిస్తున్నట్లు సిఆర్‌సి అధ్యక్షుడు తాడి నాగ మోహన్‌రెడ్డి, సిఆర్‌సి రూపశిల్పి డాక్టర్ గొలుగూరి వెంకటరెడ్డి (విక్టరీ) తెలిపారు. స్థానిక సిఆర్‌సి ఓల్డ్ ఏజ్ హోమ్‌లో ఆదివారం సిఆర్‌సి కాటన్ కళాపరిషత్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ మూడు రోజులు పాటు ఏడు ప్రదర్శనలు జరుగుతాయని, రాష్ట్ర స్థాయిలో వివిధ కళాపరిషత్తులకు చెందిన కళాకారులు పాల్గొంటారన్నారు. విజేతలకు ప్రథమ బహుమతి రూ.లక్ష, ద్వితీయ బహుమతి రూ.75 వేలు, తృతీయ బహుమతులు రూ.50వేలతో పాటు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తారన్నారు. కార్యక్రమంలో సిఆర్‌సి ఉపాధ్యక్షుడు చిన్నం తేజా రెడ్డి, ప్రధాన కార్యదర్శి కర్రి అశోక్ రెడ్డి, సిఆర్‌సి కళాపరిషత్ డైరెక్టర్ కె.సూర్య, సిఆర్‌సి డైరెక్టర్లు మల్లిడి అంజనీ కుమార్‌రెడ్డి, కొవ్వూరు నరేష్ కుమార్ రెడ్డి, మోటూరి సూర్య ప్రకాష్ రావు, చిర్ల కనికిరెడ్డి, పడాల సత్యనారాయణ రెడ్డి, పర్యవేక్షకులు గంటా రామ్మోహన్రావు, పలివెల త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై గళమెత్తుతా

పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి డివి.రాఘవులు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి, కాకినాడ, తాళ్లరేవు

తాను శాసన మండలిలో అడుగు పెట్టిన తర్వాత నిరంతరం ప్రజా సమస్యలపైనే గళమెత్తుతానని పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి డివి.రాఘవులు అన్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక యుటిఎఫ్ హోంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పిడిఎఫ్ అభ్యర్థిగా బరిలో నిలిచిన తనకు అనేక సంఘాలు మద్దతు పలుకుతున్నాయన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాలతో పాటు ప్రజా, కార్మిక సంఘాలు మద్దతుతో పోటీ చేస్తున్నానన్నారు. మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని కోరారు. గత 35 సంవత్సరాలుగా ఉపాధ్యాయ, ఉద్యోగ ఉద్యమాల్లో పాల్గొన్న అనుభవం తనకు ఉందన్నారు. ఈనెల 27న జరగనున్న పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో పోటీ చేస్తున్న తనను అత్యధిక మెజారిటీతో మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. 18 సంవత్సరాలుగా పిడిఎఫ్ ఎంఎల్‌సిలు శాసనమండలిలో గళం విప్పుతున్నారన్నారు. విలువలకు కట్టుబడి పని చేస్తున్నారన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సమస్యలతో పాటు నిరంతరం నిరుద్యోగుల ఉపాధి సమస్యలపై చేస్తున్న పోరాటాలను ఆయన వివరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగుల ఆశలు ఆవిరి అవుతున్నాయని విమర్శించారు. డిఎస్‌సిని ప్రకటించినప్పటికీ గత 8 నెలలుగా కాలయాపన చేయడం దారుణమన్నారు. 117 జీవోను రద్దు చేస్తామని ప్రకటించిన చంద్రబాబు ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. అంగన్‌వాడీలు గత ప్రభుత్వ హయాంలో 42 రోజులపాటు సమ్మె చేశారని, ఆ సందర్భంగా ప్రభుత్వ ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని చేయాలని డిమాండ్ చేశారు. శాసనమండలిలో ఉద్యోగ, ఉపాధ్యాయ పట్టభద్రుల, నిరుద్యోగుల సమస్యలపై గళం విప్పుతానని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా తొలగించిన రెండు లక్షల 40 వేల మంది వాలంటీర్లను విధుల్లోకి తీసుకుని ఇచ్చిన హామీ ప్రకారం రూ.10 వేలు వేతనం ఇవ్వాలని కోరారు. వెంటనే నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. వీటిపై మండలిలో కూడా తాను ప్రశ్నిస్తానన్నారు. విజ్ఞులైన పట్టభద్రులు పిడిఎఫ్ ఎంఎల్‌సిలను గెలిపించుకోవాలని కోరారు. యుటిఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ గత ప్రభుత్వం తీసుకొచ్చిన 117 జీవోని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ జిఒ వలన 3,4,5 తరగతులు విలీనం చేయడంతో అనేక పాఠశాలలు మూతపడ్డాయన్నారు. తక్షణమే కూటమి ప్రభుత్వం స్పందించి ఈ జిఒను రద్దు చేయాలన్నారు. ఈ నేపథ్యంలో ఎంఎల్‌సి ఎన్నికల్లో పిడిఎఫ్ బలపరిచిన వారిని ఎన్నుకోవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ సమావేశంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి టి.చక్రవర్తి, ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సత్తిరాజు, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నగేష్ పాల్గొని మాట్లాడారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఫెడరేషన్ రాష్ట్ర ఛైర్మన్ నాగేశ్వరరావు

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

శాసన మండలిలో ప్రజా సమస్యల పరిష్కారానికి పిడిఎఫ్ ఎంఎల్‌సిలు ఎప్పటికప్పుడు కృషి చేస్తున్నారని ఎంఎల్‌సి ఐ.వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం స్థానిక యుటిఎఫ్ హోంలో జరిగిన వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రస్తుత ఎన్నికల్లో పట్టభద్రుల నియోజకవర్గ అభ్యర్థిగా పోటీ చేస్తున్న డివి.రాఘవులును సభకు పరిచయం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 18 సంవత్సరాల శాసనమండలి చరిత్రలో ప్రజా సమస్యల పరిష్కారంలో పిడిఎఫ్ ఎంఎల్‌సిలు నిరంతరం కృషి చేశారన్నారు. అదేబాటలో దిడ్ల వీరరాఘవులు పని చేస్తారన్నారు. అభ్యర్థి డివి.రాఘవులు మాట్లాడుతూ తాను గెలిస్తే, శాసనమండలిలో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, 'ప్రశ్నించే గొంతికగా' ఉంటానని అన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కె.శ్రీనివాసరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సూరిబాబు, నగేష్, రాష్ట్ర కార్యదర్శులు చక్రవర్తి, జ్యోతిబసు, యుటిఎఫ్ నాయకులు సాయిరాం, సీతారామయ్య, గోవిందరాజులు, ఐ.ప్రసాదరావు, గణేశ్వరావు, పివివి. సత్యనారాయణ, పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు సత్తిరాజు, ప్రజా సంఘాల నాయకులు వీరబాబు, రాజా, నాగేశ్వరరావు, పాల్గొన్నారు.

పిడిఎఫ్ అభ్యర్థి రాఘవులు ప్రచారం

ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి స్థానానికి పిడిఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న డివి.రాఘవులు ఆదివారం తాళ్లరేవు మండలంలో ప్రజాసంఘాల నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్‌పి మాజీ చైర్మన్ దున్నా జనార్దన్‌రావు, వైసిపి జడ్‌పిటిసి దొమ్మేటి సామ్యూల్ సాగర్, వైసిపి మండల అధ్యక్షులు కాద గోవింద్‌కుమార్ తదితరులను కలిసి ఉపాధ్యాయ, ప్రజా సంఘాల మద్దతుతో పోటీ చేస్తున్న తనకు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులను ఆయన కలిసి ఓట్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు కెఎస్.శ్రీనివాస్, టేకుమూడి ఈశ్వరరావు, వల్లు రాజబాబు, పి.గోపాలకృష్ణ, సంతోష్, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాల ఆత్మీయ సమావేశంలో అభివాదం చేస్తున్న నాయకులు

పిడిఎఫ్ అభ్యర్థి రాఘవులుకే మద్దతు

కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులందరూ మొదటి ప్రాధాన్యత ఓటును పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి డివి.రాఘవులుకే వేసి గెలిపించుకుందామని ఎపి కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల ఫెడరేషన్ రాష్ట్ర ఛైర్మన్ ఎవి.నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక కచేరిపేటలోని సిఐటియు కార్యాలయంలో జరిగిన ఉద్యోగ సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం జిఒ నెంబర్ 2 ద్వారా ప్రభుత్వ శాఖల్లో పని చేసే ఉద్యోగులకు మాత్రమే ఎంటిఎస్ వర్తింపజేస్తూ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ పద్ధతిలో ఇప్పటివరకు పని చేస్తున్న ఉద్యోగులందరికి తీవ్ర అన్యాయం చేస్తుందని విమర్శించారు. ప్రతినెల ఒక శాతం కమిషన్‌తో వేతనాలు, సర్వీసు అందించే ఆప్కాస్‌ని రద్దుచేసి, 4 శాతం కమిషన్ తీసుకునే రాబందులు లాంటి కాంట్రాక్టర్ల చేతికి 1 లక్షా 20 వేల మంది ఉద్యోగుల భవిష్యత్తుని అప్పగించేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధపడిందని ఆవేదన వ్యక్తం చేశారు. పభుత్వ తాయిలాలకు లొంగకుండా ఉద్యోగులు, కార్మికుల పక్షాన పోరాడుతూ, గళమెత్తే పిడిఎఫ్ అభ్యర్థి డివి. రాఘవులును గెలిపించడం ద్వారా ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దువ్వా శేషబాబ్జి, చెక్కల రాజ్‌కుమార్, 108 ఉద్యోగ సంఘం జిల్లా అధ్యక్షులు గుబ్బల రమణ, 104 ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి త్రిమూర్తులు, సమగ్ర శిక్షా ఉద్యోగుల జెఎసి నాయకులు ఐఇఆర్‌టి. దుర్గాప్రసాద్, దానియేలు తదితరులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షునిగా బాల సత్యనారాయణ

ప్రజాశక్తి - మామిడికుదురు

ఐఎన్‌టియుసి (ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్) డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడిగా నీతిపూడి బాల సత్యనారాయణ నియమితులయ్యారు. పి .గన్నవరం నియోజకవర్గం నగరం క్యాంపు కార్యాలయంలో బాల సత్యనారాయణకి మాజీ ఎంఎల్ఎ, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొండేటి చిట్టిబాబు ఆదివారం నియామక పత్రాన్ని అందించారు. బాల సత్యనారాయణకు కాంగ్రెస్ పార్టీ తరపున శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు మహమ్మద్ ఆరిఫ్, పిసిసి సభ్యులు మాచవరపు శివనారాయణ, మండల కాంగ్రెస్ అధ్యక్షులు అప్పన్న శ్రీరామకృష్ణ, చిట్టాల రామ జోగేశ్వరరావు, బత్తుల సురేష్ బాబు, గడ్డంవెంకటేశ్వరరావు, కె.శ్యామ్, కె.పెద్దిరాజు, కె.నాగేంద్ర, మందపాటి చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.



బాల సత్యనారాయణను సన్మానించిన డిసిసి అధ్యక్షుడు కొండేటి

మెడికల్ రిప్రజెంటేటివ్స్ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - అమలాపురం

మెడికల్ రిప్రజెంటేటివ్ వార్షిక సర్వ సభ్య సమావేశం ఆదివారం యుటిఎఫ్ భవనం నందు నిర్వహించారు. సమావేశంలో నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. మెడికల్ రిప్రజెంటేటివ్లకు కనీస వేతనం రూ.26వేలు ఉండాలని, కార్మిక చట్టాలు ఉల్లంఘనను వ్యతిరేకిస్తూ సమావేశంలో పలువురు నాయకులు ఖండించారు. మెడికల్ రిప్రజెంటేటివ్‌పై యజమాన్యం దాడులకు వ్యతిరేకిస్తూ రాబోయే కాలంలో రాష్ట్ర నాయకత్వం సూచనల మేరకు ఉద్యమంలో పాల్గొని మన ఉనికిని చాటుకోవాలని మన డిమాండ్స్ సాధించాలని తీర్మానం చేశారు. ఈ వార్షిక సర్వ సభ్య సమావేశాన్ని వానపల్లి కేశవరావు అధ్యక్షతన వహించగా రాష్ట్ర నాయకులు సూరి శంకర్‌రాజు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నూకల బలరాం పాల్గొన్నారు. సమావేశం అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గంలో ప్రెసిడెంట్ జివి.ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ వి.కేశవరావు, ఎస్‌ఎన్‌విఎల్ పోలేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా కెవి.సంతోష్, ఉప కార్యదర్శిగా కొర్లపాటి రాజా, పిఎస్ఎస్.ప్రసాద్, కోశాధికారి పల్ల రమేష్, వర్కింగ్ కమిటీ మెంబర్స్ ఎం.గౌరీనాథ్, దుర్గాప్రసాద్, పి.కొండబాబు, ఎసఎస్.సాజిద్, ఆర్.సత్తిబాబు, ఎన్.శ్రీనులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను పలువురు ప్రత్యేకంగా అభినందించారు.

నూతన కార్యవర్గంతో సిఐటియు కార్యదర్శి నూకల బలరాం

గీత కార్మికుల మద్యం షాపుల ఎంపిక వాయిదా

ప్రజాశక్తి - ఆలమూరు

ఎక్సైజ్ సిఐ ఐడి.నాగేశ్వరావు

గీత కార్మికులకు మద్యం షాపుల ఎంపిక ఈనెల 10న జరగాల్సి ఉంది. అయితే ఎంఎల్‌సి ఎన్నికల నేపథ్యంలో కోడ్ అమలులో ఉన్నందున ఈ ఎంపిక వాయిదా పడిందని, లాటరీ తేదీ తదుపరి ప్రకటిస్తారని ఎక్సైజ్ సిఐ ఐడి.నాగేశ్వరావు అన్నారు. ఆదివారం ఈ మేరకు స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సబ్ డివిజన్ కార్యాలయంలో విలేకరులకు ఆయన తెలిపారు. స్థానిక ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో మూడు మద్యం షాపులకు 84 దరఖాస్తులు అందినట్లు ఆయన తెలిపారు. గీత కార్మికుల వారికి కేటాయించిన మద్యం షాపులలో ఆలమూరు మండలంలో 31, కపిలేశ్వరపురం మండలంలో 17, మండపేట మండలంలో 36 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఈనెల 10న అమలాపురం కలెక్టర్ కార్యాలయంలో లాటరీ పద్ధతిలో షాపుల కేటాయింపు జరగాల్సి ఉండగా ఎంఎల్‌సి ఎన్నికల కోడ్ అమలు కారణంగా వాయిదా పడిందన్నారు. దరఖాస్తుదారులు గమనించి తదుపరి తేదీ ప్రకటించే వరకు వేసి ఉండాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ పి.రాంబాబు ఉన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

జాతీయ రహదారి 216 పై అన్నంపల్లి అంబేద్కర్ విగ్రహం వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. దీనికి సంబంధించి స్థానిక సమాచారం మేరకు యానాం నుంచి పల్లంకుర్రు మోటార్ సైకిల్ పై వెళుతున్న ముగ్గురు యువకులు ఎదురుగా వస్తున్న వ్యాన్‌ను తప్పించబోయి రోడ్డు డివైడర్‌ను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో పల్లంకుర్రు శివారు చెయ్యేరు చెందిన బాల చింటూ(20) అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని 108 అంబులెన్స్ లో అమలాపురంలోని ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి - గొల్లప్రోలు

ఈ నెల 3వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి శనివారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గొల్లప్రోలు అరుంధతి పేటకు చెందిన గంపల జెంబు(40) ఈ నెల 3వ తేదీ అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో స్థానిక డంపింగ్ యార్డ్ వద్ద ద్విచక్రవాహనంపై వస్తూ ప్రమాదవశాత్తు పడిపోయాడు. అతనిని 108 అంబులెన్స్‌లో కాకినాడ జిజిహెచ్‌కు తరలించారు. 4 రోజుల అనంతరం మెరుగైన వైద్యం కోసం కాకినాడలో ఓ ప్రయివేటు ఆసుపత్రికి కుటుంబీకులు తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆరోగ్యం విషమించడంతో శనివారం రాత్రి మృతి చెందాడు. మృతిని మేనమామ గంపల వీర నాగేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఎన్.రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - పెద్దాపురం

పట్టణ పరిధిలోని సుధా కాలనీలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై ఆదివారం రాత్రి ఎస్ఐ వి.మౌనిక ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో పేకాడుతున్న ఆరుగురిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.52,210 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మౌనిక తెలిపారు.

డివైడర్‌పైకి దూసుకెళ్లిన ఆర్‌టిసి బస్సు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక దర్గా సెంటర్‌లో ఆదివారం రాత్రి ఆర్‌టిసి బస్సు అదుపుతప్పి డివైడర్ పైకి దూసుకెళ్లింది. డ్రైవర్ చాకచక్యంతో బస్సును ఆపడంతో ప్రమాదం తప్పింది. బస్సులోని ప్రయాణికులు అందరూ క్షేమంగా ఉండటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ సంఘటన తెలిసిన వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి - రామచంద్రపురం

హసన్‌బాదగ్రామంలో జై భీమ్ ఫ్రెండ్స్ సర్కిల్ వారి ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభమైంది. ఫిబ్రవరి 14 వరకు జరిగే క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా ఆదివారం గ్రామ సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు టాస్ వేసి మ్యాచ్ ప్రారంభించారు. క్రీడా కారులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ నెల ఫిబ్రవరి 14 వరకూ ఈ టోర్నమెంట్ కొనసాగనున్నట్లు నిర్వాహకులు తెలియజేశారు. ఆటల పట్ల మక్కువ పెంచుకొని యువకులు రాణించాలని క్రికెట్ తో పాటు మిగిలిన క్రీడలకు మంచి భవిష్యత్తు ఉందని సతీష్ రావు సూచించారు.

కళాకారుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - పిఠాపురం

కళా పరిషత్ నిర్వాహకులు, కళాకారుల సమస్యలను పరిష్కరించాలని భోగాపురం నాటక కళాపరిషత్ అధ్యక్షులు అడపా సూరిబాబు కోరారు. ఈ మేరకు ఇటీవల రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక మంత్రి కందుల దుర్గేష్‌ను కలిసి వినతిపత్రాన్ని అందించినట్లు ఆదివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపారు. మన సంస్కృతి, సాంప్రదాయ కళలు, నాటక ప్రదర్శనలు ఇస్తున్న వివిధ కళాపరిషత్‌ల నిర్వాహకులు, కళాకారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. ఇటీవల విద్యా శాఖ విడుదల చేసిన ఉత్తర్వుల ప్రకారం హైస్కూలు, కళాశాలల్లో నాటక పరిషత్‌ల నిర్వహణకు అనుమతి లేకుండా పోయిందన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న మెజిస్ట్రేట్

చట్టాలపై అవగాహన ఉండాలి

ప్రజాశక్తి - కాట్రేనికోన

చట్టాలపై ప్రతీ ఒక్కరికి అవగాహన ఉండాలని మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్, ముమ్మిడివరం జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ రహంతుల్లా అన్నారు. చెయ్యేరు గ్రామ సచివాలయం వద్ద పంచాయతీ కార్యదర్శి జెవివి.సత్యనారాయణ ఆధ్వర్యంలో 'వెట్టి చాకిరీ విధానం'పై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్, ముమ్మిడివరం జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ రహంతుల్లా ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ పౌరుల హక్కులను హరించే వెట్టి చాకిరీ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. వెట్టి చాకిరీ దురాచారాన్ని సమాజం నుంచి పారద్రోలేందుకు న్యాయస్థానాలు విరివిగా న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహిస్తుందన్నారు. వెట్టి చాకిరీ బాధితలు ఎవరైనా ఉంటే వారికి న్యాయవ్యవస్థ ద్వారా ఉచిత న్యాయం అందించి వెట్టి చాకిరీ నుంచి రక్షణ కల్పిస్తుందన్నారు. అలాగే 14 ఏళ్ల లోపు చిన్నారులను బడికి పంపాలని, అలా కాకుండా వారిని పనిలో పెట్టుకుంటే శిక్షార్హులవు తారన్నారు. ఈ కార్యక్రమంలో బార్ ప్రెసిడెంట్ దాసరి సత్యనారాయణ, సీనియర్ అడ్వకేట్ ఇ ఎస్ బాబు స్థానిక సర్పంచ్ చెల్లి సురేష్, కాట్రేనికోన ఎస్ఐ, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భూముల క్రమబద్ధీకరణకు సిద్ధం

ప్రజాశక్తితో జెసి రాహుల్ మీనా

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

మీ సేవ, గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా భూముల క్రమబద్ధీకరణకు దరఖాస్తులు స్వీకరించేందుకు రంగం సిద్ధం చేశామని కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా తెలిపారు. రెవెన్యూ యంత్రాంగం వేగంగా, ప్రామాణికమైన విధానాన్ని అందుబాటులోకి తెచ్చినట్టు తెలిపారు. రాష్ట్రంలో అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణకు సంబంధించి మరో కీలక ముందడుగు ఈ సందర్భంగా వివరించారు.

ఎలా దరఖాస్తు చేసుకోవచ్చు..

ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఎంతోమంది నిరు పేదలకు లబ్ధి చేకూరనుంది. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా ఈజీగా క్రమబద్ధీకరణ చేసుకునేందుకు ఈ సందర్భంగా అవకాశం దక్కింది. ఈ పథకానికి సంబంధించి మీ సేవ కేంద్రాలు, గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా దరఖాస్తు చేసుకునే విధానాన్ని అందుబాటులోకి వచ్చింది. జిఓ నెంబర్ 30ని అనుసరించి ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీమ్ 2025 పేరిట భూముల క్రమబద్ధీకరణ చేపడతారు. ఈ సంవత్సరం డిసెంబరు 31 వరకు గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తులను స్వీకరిస్తారు. క్రమబద్ధీకరణ పట్టాలను మహిళల పేరిట మాత్రమే జారీ చేస్తారు.

యాజమాన్య హక్కులు ఎప్పటికి వస్తాయి.

క్రమబద్ధీకరణకు లబ్ధిదారులకు పట్టా, కన్వేయన్స్ డీడ్ అందజేసిన రెండేళ్ల తర్వాత యాజమాన్య హక్కులు జారీ అవుతాయి. పూర్తి వివరాలను నిర్ధారించిన దవీకరణ పత్రాలతో మీసేవ ద్వారా అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. 2019 అక్టోబరు 15ను ప్రమాణిక తేదీగా తీసుకుని ఆ తేదీ కంటే ముందు ఆక్రమణలలో ఉన్న భూములను నిబంధనలను అనుసరించి క్రమబద్ధీకరిస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు సిసిఎల్ఎ అధికారులు అత్యంత వేగంగా, ప్రామాణికమైన దరఖాస్తు విధానాన్ని మీసేవ ద్వారా అందుబాటులోకి తీసుకు వచ్చారు.

దీనికి గల నిబంధనలు ఏమిటి

150 గజాల వరకు ఉచితంగా క్రమబద్ధీకరణ చేస్తాము.రిజిస్ట్రేషన్ ఫీజు సైతం చెల్లించక్కర్లేదు. దారిద్ర్యరేఖకు దిగువన ఉండి 151 నుంచి 300 గజాల్లోపు ఆక్రమణలకు బేసిక్ ధరలో 15 శాతం, రిజిస్ట్రేషన్ ఫీజులో 50 శాతం చెల్లించాలి. దారిద్ర్యరేఖకు ఎగువన ఉన్న వారు పూర్తి రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలి. 300 నుండి 450 గజాల పరిధిలో బిపిఎల్ కుటుంబాల వారు వందశాతం బేసిక్ ధర, 50 శాతం రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలి. ఇదే విభాగంలో దారిద్ర్యరేఖకు ఎగువన ఉన్న వారు 200 శాతం బేసిక్ ధర, పూర్తి రిజిస్ట్రేషన్ ఫీజు కట్టవలసి ఉంటుంది. 450 గజాలకు మించిన అక్రమణలో ఎవరు ఉన్నప్పటికీ బేసిక్ ధరకు ఐదు రెట్లు, వందశాతం రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి క్రమబద్ధీకరించుకోవలసి ఉంటుంది. అందుకు సిద్ధంగా లేకుండా ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుంది.

ఏయే స్థలాలకు క్రమబద్ధీకరణ చేస్తారు

లే అవుట్ స్థలాలు, కాలువలు, నదీ ప్రవాహ గట్లు, మాస్టర్ ప్లాన్, జోనల్ ప్లాన్‌లో నిర్దేశిత స్థలాలు, జలవనరులకు సంబంధించిన స్థలాలు క్రమబద్ధీకరణ చేయరు. లబ్ధిదారులు, కుటుంబసభ్యులు ఐటి చెల్లింపుదారై ఉండకూడదు. నాలుగు చక్రాల వాహనం ఉండకూడదు. గరిష్ఠంగా గ్రామాల్లో నెలకు రూ. 10 వేలు, పట్టణాల్లో నెలకు రూ.14 వేల ఆదాయం ఉన్నవారు దీనికి అర్హులుగా నిర్ణయించారు. నెలకు రూ.300 లోపు విద్యుత్తు ఛార్జీలు చెల్లింపు ఉండాలి. మెట్ట, మాగాణి కింద కలిపి 10 ఎకరాలు మించకూడదు. ఆధార్ కార్డ్, రేషన్ కార్డ్, గ్యాస్ కనెక్షన్, ఇటుక గోడలతో నిర్మాణాన్ని పరిగణనలోకి తీసుకుంటారు. ఆస్తిపన్ను చెల్లింపు, విద్యుత్తు బిల్లు, వాటర్ బిల్లులను పరిగణనలోకి తీసుకుంటారు.

జాబితాలను ఎలా ప్రదర్శిస్తారు..

ఇప్పటికే స్వీకరించి, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిగణనలోకి తీసుకుంటాం. రాష్ట్రవ్యాప్తంగా తహశీల్దార్ పర్యవేక్షణలో గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది ఆక్రమణలు జరిగిన ప్రాంతాలు పరిశీలిస్తారు. అనంతరం అర్హత కలిగిన లబ్ధిదారుల జాబితాను గ్రామ,వార్డు కార్యాలయాల్లో ప్రదర్శిస్తారు.

అభ్యంతరాలు స్వీకరించి తహశీల్దార్లు తుది జాబితాను సబ్‌కలెక్టర్, ఆర్‌డిఓకు పంపిస్తారు. సబ్ డివిజన్ లెవెల్ అప్రూవల్ కమిటీ ప్రకటించిన అర్హుల జాబితాపై అభ్యంతరాలు ఉంటే జాయింట్ కలెక్టర్‌కు 30 రోజుల్లోగా అప్పీలు చేసుకోవచ్చు. అర్హుల జాబితా ఖరారైన తర్వాత ఆ వివరాలను తహశీల్దార్లు ఆ ప్రాంత సబ్-రిజిస్ట్రార్లు, జిల్లా రిజిస్ట్రార్లకు పంపుతారు. చివరి నిమిషం వరకు వేచి చూడకుండా అర్హులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలి.

దళారులను నుంచి రైతులను కాపాడాలి

రైతు బజార్లో కూరగాయలు కొనుగోలు చేస్తున్న ఎంఎల్‌సి ఐవి

ప్రజాశక్తి - అమలాపురం

రైతులు ఎంతో కష్టపడి పండించిన కూరగాయలను రైతు బజార్ల ద్వారా విక్రయించి దళారుల నుండి అన్నదాతలను కాపాడాలంటూ ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు కోరారు. అమలాపురం రైతు బజార్ ను ఆదివారం ఆయన సందర్శించి కూరగాయలు కొనుగోలు చేసి రైతులకు అండగా నిలిచారు. అమలాపురంలో రైతు బజార్ లేకపోవడంతో దళారులు కూరగాయల ధరలు అమాంతంగా పెంచి సామాన్యుడు కొనేటట్టు లేకుండా చేశారని అన్నారు. రైతు బజార్లో రైతులు తీసుకొచ్చే తాజా కూరగాయలు అందుబాటు ధరలో లభించడంతో ఇటు వినియోగదారుడికి అటు రైతుకు లాభం చేకూర్చుతుందని అన్నారు. ప్రతిరోజు కూరగాయల ధరలు రేట్లు పట్టిక లో పొందుపరచడంతో వినియోగదారుడికి కూరగాయల ధరలు తెలుస్తున్నాయని, బయట దళారులు ఎక్కువ రేట్లకు విక్రయించినట్లయితే ప్రశ్నించే పరిస్థితి ఏర్పడింది అని తెలిపారు. సామాన్య ప్రజలు కావలసిన కూరగాయలు రైతు బజార్లో కొనడం ద్వారా గిట్టుబాటు ధర రైతుకు అందుతుందని, తక్కువ ధరలో సామాన్యులు కూరగాయలు లభిస్తాయని అని తెలిపారు.

పుంతగట్లపై ఆక్రమణల తొలగింపు

ప్రజాశక్తి - ఆలమూరు

సాగునీటి ఆటంకం లేకుండా కాలువల పుంతగట్లపై ఆక్రమణల తొలగింపు చర్యలు చేపట్టినట్లు సాగునీటి సంఘం అధ్యక్షుడు గారపాటి శ్రీనివాస చౌదరి అన్నారు. చింతలూరులోని దుర్గాదేవి ఆలయం నుంచి ఆంజనేయస్వామి ఆలయం వంతెన వరకూ పంటకాలువలలో పూడిక తీత పనులు చేయడంతో పాటు కాలువ గట్టుపై ఉన్న ఆక్రమణలను తొలగించేందుకు ఆదివారం ఆయన శ్రీకారం చుట్టారు. సాగునీటి సంఘం సకాలంలో నిధులు మంజూరు చేయకపోయినా ముందస్తు పెట్టుబడిగా తన సొంత నిధులను వెచ్చించి ఈకాలువ అభివృద్ధి పనులను నిరాటంకంగా చేస్తున్నట్లు ఆయన తెలిపారు. దీంతో ఆ ప్రాంత రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వేడుకల్లో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

ఘనంగా ఎంఎల్ఎ సుబ్బరాజు పుట్టినరోజు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

ప్రభుత్వ విఎ, ముమ్మిడివరం ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు పుట్టినరోజు వేడుకలు ఆదివారం పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. నగర పంచాయతీ పరిధిలోని స్థానిక పార్టీ కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షుడు అర్ధాని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఎంఎల్ఎ పుట్టినరోజు వేడుకలకు మాజీ ఎంఎల్ఎ చెల్లి వివేకానంద ముఖ్య అతిథిగా పాల్గొని కేక్ కట్ చేసి నాయకులు, కార్యకర్తలకు పంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధే ధ్యేయంగా పని చేసే ఎంఎల్ఎ సుబ్బరాజు పనిచేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో దాట్ల పృథ్వీరాజ్, చెల్లి అశోక్, గోలకోటి దొరబాబు, తాడి నరసింహారావు, దొమ్మేటి రమణ కుమార్, సాగిరాజు సూరిబాబు రాజు, కాకర్లపూడి రాజేష్ ,చిక్కాల అంజిబాబు, గొల్లపల్లి గోపి, పిల్లి నాగరాజు,కాశి రామచంద్రరావు, విళ్ల వీరస్వామి నాయుడు, పళ్ళ రాజబాబు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన సత్తెమ్మ జాతర

ప్రజాశక్తి - కొత్తపేట

వాడపాలెం గ్రామంలో సత్తెమ్మ తల్లి అమ్మవారి జాతర మహోత్సవాలు ఆదివారం ముగిశాయి. కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావు, జనసేన ఇన్‌ఛార్జి బండారు శ్రీనివాస్‌లు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆదివారం ఉదయం నుంచిపదివేల మంది యాత్రికులక న్నదాన కార్యక్రమం నిర్వహించారు కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఐలమ్మ స్ఫూర్తితో రజకులు అభివృద్ధి చెందాలి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

ఐలమ్మ చిత్రపటం వద్ద రజకుల నివాళి

చాకలి ఐలమ్మ స్ఫూర్తితో రజకులు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలని అంబేద్కర్ కోనసీమ జిల్లా అన్నంపల్లి రజక సంఘం పేర్కొంది. అన్నంపల్లి గ్రామంలో రజకుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం బల్లల పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా స్వాతంత్ర్య భూ పోరాటంలో ముఖ్య భూమిక పోషించిన చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బల్లల పూజ సందర్భంగా నిర్వాహకులు భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని రజకుల సంఘం సభ్యులు, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

అబ్బులుకు పలువురి అభినందన

ప్రజాశక్తి - ఆలమూరు



మెడల్స్ అందుకుంటున్న అబ్బులు

అథ్లెటిక్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన తాతపూడి అబ్బులు ఆదివారం పలువురు అభినంది చారు. అనంతపూర్‌లో ఈనెల 7,8, 9. తేదీలలో రాష్ట్ర స్థాయి మాస్టర్ల అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఆలమూరు మండలంలోని కలవచర్ల వాసి, విఆర్ఒ తాతపూడి అబ్బులు 45 ప్లస్ ఈవెంట్స్ షాట్ పుట్ విభాగంలో సిల్వర్ మెడల్, హెమర్‌త్రో ఈ విభాగాలలో బ్రాంజ్ మెడల్ సాధించారు. మెడల్స్ సాధించిన అబ్బులను డివికె.రాజొసికమణి, రిటైర్డ్ డిఎస్‌పి ఎపి మాస్టర్ అసోసియేషన్ ఛైర్మన్ ఎస్‌వై.రామ ప్రసాద్, ఆల్ ఇండియా మాస్టర్ల అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్, ఈస్ట్ గోదావరి మాస్టర్ల అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బి.కృష్ణమూర్తి తదితరులు అభినందించారు.

గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థిని అభినందిస్తున్న మంత్రి సుభాష్

బంగారు పతక విజేతకు మంత్రి అభినందన

ప్రజాశక్తి - రామచంద్రపురం

అంతర్జాతీయ స్థాయి కిక్ బాక్సింగ్ పోటీల్లో ద్రాక్షారామకు చెందిన ఏడవ తరగతి విద్యార్థి యాళ్ళ సురేష్ కుమార్ బంగారు పతకం సాధించాడు. ఈ సందర్భంగా ఆదివారం సురేష్‌కుమార్‌ను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రశంసించారు. నియోజకవర్గం కీర్తి ప్రతిష్టలు ప్రపంచానికి తెలిసేలా ఒక బంగారు, రెండు కాంస్య పతాకాలు సాధించడం పట్ల మంత్రి సుభాష్ ఆనందం వ్యక్తం చేశారు. ఫిబ్రవరి 1 నుంచి 5 వరకు కిక్ బాక్సింగ్ టోర్నమెంట్ న్యూఢిల్లీలో జరిగింది. కిక్ బాక్సింగ్ పోటీల్లో లైట్ లైట్ కాంటాక్ట్ విభాగాలో 37 కేజీల విభాగంలో గోల్డ్ మెడల్, లైట్ కాంటాక్ట్ విభాగంలో రెండు బ్రాంజ్ మెడల్స్ సాధించారు. తాను సాధించిన పథకాలతో సురేష్ కుమార్ తన తండ్రి యాళ్ళ అంజిబాబుతో కలిసి మంత్రి సుభాష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

సైన్స్ ఎగ్జిబిషన్ ప్రారంభిస్తున్న డాక్టర్ కవిత తదితరులు

ఆకట్టుకున్న సైన్స్ ఎగ్జిబిషన్

ప్రజాశక్తి - రామచంద్రపురం

అంతర్జాతీయ మహిళా బాలికల సైన్స్ దినోత్సవ సందర్భంగా ఆదివారం రామచంద్రపురంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ అందర్నీ ఆకట్టుకుంది. ప్రారంభ సభకు సైన్స్ ఫౌండేషన్ గౌరవ అధ్యక్షురాలు డాక్టర్ చెలికాని కవిత అధ్యక్షత వహించారు. ఆమె మాట్లాడుతూ బాలికలలో శాస్త్రీయ దక్పథాన్ని పెంపొందించేందుకు సైన్స్ ప్రదర్శనలు ఉపయోగపడతాయని అన్నారు. సైన్స్ ఎగ్జిబిషన్ ను ఎజిపి. పద్మ కమల కుమారి ప్రారంభించారు. కార్యక్రమం లో రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 150 ప్రాజెక్ట్స్ వచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు. బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో డాక్టర్ సి. రామారావు, మోడరన్ అధినేత జివి.రావు, జిల్లా సైన్స్ ఆఫీసర్ జివిఎస్.సుబ్రహ్మణ్యం, జి.వసంత కుమార్, పివి.బ్రహ్మానందం, రవి కుమార్, కెవివి.సత్యనారాయణ, రేవతి సైన్స్ ఫౌండేషన్ అధ్యక్ష కార్యదర్శులు కె. శ్రీ కృష్ణ సాయి, బుద్ధా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పలువురికి దంత వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - ఆలమూరు

వైద్య శిబిరాన్ని ప్రారంభించిన సర్పంచ్

పినపళ్ళ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద అంజన మల్టీ స్పెషాలిటీ డెంటల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో పలువురికి ఉచిత దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. సర్పంచ్, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జనసేన కార్యదర్శి సంగీత్ సుభాష్ హాజరై ఆదివారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్లు రేవంత్, చంద్రశేఖర్ లు పలువురు గ్రామస్తులకు దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు పి.పట్టాభి రామన్న, మాజీ ఎఎంసి ఛైర్మన్ వక్కపట్ల లక్ష్మణరావు, పారిశ్రామికవేత్త వట్టికూటి సతీష్ బాబు, రాష్ట్ర కాపు సంక్షేమ సంఘం కార్యదర్శి పెద్దిరెడ్డి మహేష్, జనసేన నాయకులు నామాల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

గొల్లవిల్లిలో శివయ్య కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎంఎల్ఎ ఆనందరావు

పలు కుటుంబాలకు ఎంఎల్ఎ పరామర్శ

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

ఇటీవల మృతి చెందిన పలువురి కుటుంబ సభ్యులను ఆదివారం ఎంఎల్ఎ అయితాబత్తుల ఆనందరావు పరామర్శించారు. ఉప్పలగుప్తంకు చెందిన మీసేవ నాని నాగులపల్లి వెంకట రామాంజనేయులు భార్య రాధాదేవి మృతి చెందగా ఆ కుటుంబాన్ని, గొల్లవిల్లికి చెందిన మద్దింశెట్టి సాంబశివరావు మృతి చెందగా ఆ కుటుంబ సభ్యులను, సూదాపాలెంకు చెందిన యెలుబండి సత్య వినయ్ కుటుంబాన్ని, సుందరనీడి బాపన్న నాయుడు కుటుంబాన్ని ఎంఎల్ఎ ఆనందరావు పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. పరామర్శించిన వారిలో మాజీ జడ్‌పిటిసి సభ్యుడు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దేశంశెట్టి లక్ష్మీనారాయణ, టిడిపి మండల అధ్యక్షుడు అరిగెల నానాజీ, గ్రామ కమిటీ అధ్యక్షుడు చీకట్ల ఏసుబాబు నాయకులు రవణం మధు,సలాది శ్రీనివాసరావు, మధుర నరసింహమూర్తి తదితరులు ఉన్నారు.

తండ్రికి కూతురు తలకొరివి

ప్రజాశక్తి - అంబాజీపేట

ఇసుకపూడిలో తండ్రికి తలకొరివి పెట్టిన కూతురు

కూతురు తండ్రికి తలకొరివి పెట్టిన సంఘటన ఇసుకపూడిలో ఆదివారం చోటు చేసుకుంది. ఇసుకపూడికి చెందిన పమ్మి వెంకటేశ్వరరావు రెండేళ్లుగా అనారోగ్యానికి గురై, మంచానికే పరిమితమయ్యాయి. ఆదివారం పరిస్థితి విషమించడంతో మరణిం చారు. దీంతో ఆయన కుమార్తె పద్మ అన్నీ తానై తండ్రికి ఎన్నో సేవలు చేసింది. తుది శ్వాస విడిచిన తండ్రికి కొడుకు స్థానంలో తలకొరివి పెట్టి అంత్యక్రియలు నిర్వహించింది.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

ప్రజాశక్తి - అమలాపురం

ఎంఎల్‌సి ఎన్నికల ప్రవర్తన నియ మావళి అమలులో ఉన్నందున ఈనెల 10న సోమవారం జిల్లా స్థాయి, మండల స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వ హించడం లేదని కలెక్టర్ రావిరాల మహేష్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు అర్జీదారు లు ఈ విషయాన్ని గమనించి సహకరించాలన్నారు. అర్జీదారులు వారికి సమీపం లోని గ్రామ/ వార్డు సచివాలయాలలో వారి ఫిర్యాదులను నమోదు చేసుకొనవచ్చునని తెలిపారు.

వైసిపి మహిళా జిల్లా అధ్యక్షురాలు గిరిజాకుమారికి సత్కారం

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

సత్కరిస్తున్న జడ్‌పిటిసి సంపద రావు

జిల్లా వైసిపి మహిళా అధ్యక్షురాలుగా ఇటీవల సన్నవిల్లి-నంగవరం ఎంపిటిసి సభ్యురాలు వంగా గిరిజాకుమారి నియమితులయ్యారు. ఈ సందర్భంగా సన్నవిల్లిలోని ఆమె నివాసంలో ఆదివారం ఆమెను జడ్‌పిటిసి సభ్యుడు గెడ్డం సంపదరావు దుశ్శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా సంపదరావు మాట్లాడుతూ పదవి ద్వారా వైసిపి బలోపేతానికి గిరిజాకుమారి కృషిచేసి మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. గిరిజాకుమారిని వైసిపి నాయకుడు యాళ్ల చిన్న అభినందించారు.

శిథిలావస్థకు చేరిన బోడిపాలెం వంతెన

- ఆందోళన చెందుతున్న వివిధ గ్రామాల ప్రజలు
- చర్యలు చేపట్టాలని పాలకులు, అధికారులకు విజ్ఞప్తి

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

మండలంలోని బోడిపాలెం వంతెన శిథిలావస్థకు చేరింది. ఈ వంతెన శిథిలావస్థలో ఉందని తెలిసినా ప్రతి నిత్యం వందలాది లారీలు మట్టి లోడ్‌తో ఇటుక బట్టీలకు వెళుతూ వుంటాయి. ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కపిలేశ్వరపురం మండలం లంక గ్రామాల సమీపంలో ఉన్న బోడిపాలెం వంతెన శిథిలావస్థకు చేరుకుంది. బ్రిటిష్ కాలంలో ఈ వంతెన నిర్మించారు. ఇప్పటివరకూ ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు శిథిలావస్థలో ఉన్న వంతెన నిర్మిస్తామని అంటూ కాలయాపన చేస్తున్నారే తప్ప అధికారులు ఇంతవరకు వంతెన నిర్మాణ పనులు చేపట్టలేదు. కేదార్లంక, వీధివారిలంక, నారా యణ లంక గ్రామస్థులు ప్రతి నిత్యం ఏ చిన్న పని కైనా కొత్త పేట, రావుల పాలెం, అమలాపురం వంటి ప్రాంతాలకు రాక పోక లు సాగించాలంటే ఈ బోడేపాలెం వంతెనే ఆధారం. ఈ వంతెన కాస్తా కూలితే రాకపోకల పరిస్థితి ఏంటని లంక గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అతి వేగంతో భారీ వాహనాలు వెళ్ళడం వల్ల వద్ధులు, పిల్లలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఏ క్షణంలో ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వంతెన సమస్యను దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని లంక గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

బోడిపాలెం వంతెన దుస్థితి

ఒరిజినల్ దస్తావేజు పడిపోయినది

కాకినాడ జిల్లా, తుని మండలం, ఎస్.అన్నవరం గ్రామకాపురస్తులు, చోడిశెట్టి సూర్యారావు గారి కుమార్తెయున్నూ, పొలిమేర సత్యనారాయణ గారి భార్య పొలిమేర మంగలక్ష్మీ అను నేను ది. 07-02-2025 సం॥రం తేదిన నా తండ్రి గారి తాలూకు **దస్తావేజు నెం. 8656/1981** రు గల ఒరిజినల్ దస్తావేజును తీసుకుని జెరాక్స్ కాపీ నిమిత్తం జెరాక్స్ సెంటరు వెళ్ళేసరికి మార్గ మధ్యలో సదరు ఒరిజినల్ దస్తావేజు ఎక్కడో పడిపోయినది. సదరు ఒరిజినల్ దస్తావేజు కొరకు చుట్టు ప్రక్కల అంతా వెతికిన దొరకలేదు. దొరికిన యెడల కింది అడ్రస్కు ఇవ్వవలెను.

పొలిమేర మంగలక్ష్మీ,
మామిడాల లవకుమారి, చోడిశెట్టి వాణి,
కాకినాడ జిల్లా, తుని మండలం,
ఎస్.అన్నవరం గ్రామం, సెల్ నెం. 7386723333

In the Court of the 1st Additional Senior Civil Judge at Kakinada
O.S. No. 88/2023

Between:
Pulapakuri Sundar Kumar ...*Plaintiff*
AND
Kaki Sheela ...*Defendant*

To:
Kaki Sheela, D/o. Sudhakar, D.No. 1-121, K.Gangavaram, K.Gangavaram Mandal, Dr. B.R. Ambedkar Konaseema District.

పై నెంబరు దావాలో ప్రతివాది అయిన మీకు శ్రీ కోర్టువారి ద్వారాఎన్నిసార్లు దావా సమన్లు పంపినను మీరు ఉద్దేశ్యపూర్వకంగా తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది. 27-2-2025 సం॥ తేదీకి వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై శ్రీ కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, మీ వకీలు గారి ద్వారా గాని హాజరు అయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై దావా మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
అంగాడ సత్య రాఘవేంద్ర (ASR)
కాస్సే రాజు,మందపాటి వెల్సీ ప్రవీణ్
న్యాయవాదులు,దుగ్గిరాల వారి వీధి,
కాకినాడ, సెల్: 8886888844